తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 28- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 330 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# మహిళలు, పిల్లల భద్రతకు 'స్పందన' బృందాలు

సీఎం రేవంత్ రెడ్డి
టెలంగాణ కమాండ్ కంట్రోల్
సెంటర్ నుంచి ప్రారంభం
24 గంటలు పనిచేసే తక్షణ రక్షణ వ్యవస్థ
డ్రగ్స్ నియంత్రణ, సమాజ భాగస్వామ్యంపై దృష్టి



హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు): మహిళలు, పిల్లల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మహిళల భద్రత కోసం ఇప్పటికే అమలు చేస్తున్న షీ టీమ్స్, స్టాండ్ విత్ హర్ కార్యక్రమాల సరసన కొత్తగా 'స్పందన' తక్షణ రక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా టెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్పందన వాహనాలకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నగర పోలీసు అధికారులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళ తన కాళ్ల మీద తాను నిలబడాలంటే భద్రత అత్యంత అవసరమని అన్నారు. మహిళలు చదువు, వ్యాపారం స్వేచ్ఛగా కొనసాగించగలిగితేనే సమాజం

మిగతా 2లో

# ప్రజా సమస్యలపై పోరాడేవారికే టికెట్లు

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం
- సభ్యత్వ నమోదు లక్ష్యాలు చేరుకోకపోతే చర్యలు హెచ్చరిక
- రైతుల పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- పార్టీ కమిటీల రద్దు – పునర్వ్యవస్థీకరణకు నిర్ణయం



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడే నాయకులకే వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లక్ష్యాలు చేరుకోలేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని ఆయన విమర్శించారు. పండిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని ఆరోపించారు.

మిగతా 2లో

# తెలంగాణ కోసం మరోసారి పోరాటం: కేటీఆర్ పిలుపు

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందేశం
- ఉద్యమం నుంచి అధికారానికి ప్రయాణం గుర్తు
- రాష్ట్ర రక్షణకు పునరంకితం కావాలని పిలుపు



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కీలక సందేశం ఇచ్చారు. ఉద్యమ పార్టీగా ఢిల్లీ మెడలు వంచించి తెలంగాణ సాధించిన కీర్తి తమదేనని,

మిగతా 2లో



# ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి పొంగులేటి సమీక్ష

భూ సమస్యల పరిష్కారానికి
అధికారులకు ఆదేశాలు
లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల సొంతింటి కల అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం, భూభారతి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంకల్పం సాకారం కావాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

మిగతా 2లో

## అంబర్‌పేటలో మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో

# అగ్నిప్రమాదం

**భారీ మంటలు, దట్టమైన పొగతో ఆందోళన**
**ఫైర్ ఇంజిన్లతో మంటల అదుపు చర్యలు**
**సమీప నివాసితుల తరలింపు, దర్యాప్తు ప్రారంభం**



హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని అంబర్‌పేట 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్ లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగతో కమ్ముకుపోయింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మిగతా 2లో

# ప్రముఖుల పేరుతో మోసం

- ఇన్‌ఫ్రాటెక్ సంస్థ నుంచి కోట్ల వసూళ్లు
- ప్రాజెక్టు పేరుతో మభ్యపెట్టిన నిందితుడు
- కేసు నమోదు, నిందితుడి కోసం గాలింపు

5లో






# కవిత పార్టీపై తీన్మార్ మల్లన్న ఆరోపణలు

- రేవంత్ రెడ్డి పాత్రపై సంచలన వ్యాఖ్యలు
- మంత్రి పదవి అంశంపై సవాల్
- తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశం

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన ఆరోపణలు చేశారు. కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ వెనుక ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను బలహీనపర్చడమే ఈ రాజకీయ వ్యూహం లక్ష్యమని వ్యాఖ్యానించారు. కవిత మాట్లాడే ప్రతి మాట వెనుక రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ ఉందని మల్లన్న అన్నారు. పార్టీ కార్యక్రమాలకు అవసరమైన నిధులను కూడా ఆయన సమకూరుస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.
ఈ సందర్భంగా కవితకు మల్లన్న నేరుగా సవాల్ విసిరారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి ఇవ్వాలనే ప్రయత్నం జరిగిందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లతో పాటు నాలుగో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సింది

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మహిళలు, పిల్లల భద్రతకు 'స్పందన' బృందాలు


(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
మహిళలపై వేధింపులను పూర్తిగా అరికట్టాలని సూచిస్తూ, స్వచ్ఛంధ సంస్థలు, పీస్ కమిటీలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. సమాజంలో వివక్షకు గురయ్యే మహిళలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్పందన బృందాలు బాధితుల వద్దకు వెంటనే చేరుకుని మొదట మానసిక ధైర్యాన్ని కల్పించి, అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని తెలిపారు.
మహిళల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం, సమాజం కలిసి నిలబడుతాయన్న నమ్మకం కల్పించాలన్నారు.
మహిళలపై నేరాలకు కారణంగా మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోందని పేర్కొంటూ, డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ దిశగా ఈగిల్ తెలంగాణ ఫోర్స్ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. డ్రగ్స్ బారిన పడిన వారి కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.
మహిళల ఆర్థిక స్వావలంబన రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సాధికారతే రాష్ట్ర ఆర్థిక పురోగతికి పునాది అని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




# శాసనసభ ప్రాంగణం ఆధునికీకరణకు వేగం

- పార్లమెంట్ తరహా సెంట్రల్ హాల్ ఏర్పాటు నిర్ణయం
- సభ్యుల గౌరవం, గోప్యతకు ప్రాధాన్యత
- భద్రత, సౌకర్యాల సమగ్ర బలోపేతం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, దేశ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభ ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని ప్రణాళికలపై చర్చించారు.
శాసనసభ ప్రాంగణం సభ్యుల గౌరవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ప్రజాప్రతినిధులకు తగిన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. సమావేశాల సమయంలో సభ్యులకు గోప్యత ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయడం ద్వారా సభ్యుల మధ్య చర్చలు, పరస్పర సంభాషణలకు అనువైన వేదిక కల్పించాలని ఆదేశించారు. ఈ సెంట్రల్ హాల్‌ను రాబోయే సమావేశాల నాటికి సిద్ధం చేయాలని అధికారులకు గడువు నిర్దేశించారు. సభ్యుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రత్యేక మెంబర్స్ క్లబ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సభ్యులు విశ్రాంతి తీసుకునేలా, సమావేశాలకు సిద్ధమయ్యేలా, పరస్పరం చర్చించుకునేలా ఈ క్లబ్ ఉపయోగపడాలని తెలిపారు. అలాగే ప్రస్తుత శాసనసభ భవనం, పాత మండలి భవనాల వారసత్వ విలువను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.
సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా సభ్యులు శారీరకంగా చురుకుగా ఉండేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పనిబరువు మధ్య విశ్రాంతి, ఆరోగ్య సంరక్షణకు అనుకూల వాతావరణం అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. భద్రతా పరంగా శాసనసభ ప్రాంగణాన్ని మరింత పటిష్టం చేయాలని సీఎం ప్రత్యేకంగా ఆదేశించారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా సీసీ కెమెరాలు, ప్రవేశ నియంత్రణ వ్యవస్థలు, భద్రతా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల భద్రతకు ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే సందర్శకుల ప్రవేశంపై కట్టుదిట్టమైన నియంత్రణ ఉండాలని చెప్పారు.
ప్రాంగణంలో చేపట్టే అభివృద్ధి పనులు సమయానికి పూర్తయ్యేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. శాసనసభ ప్రాంగణం దేశంలోని అత్యుత్తమ ప్రాంగణాల్లో ఒకటిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

# ప్రజా సమస్యలపై పోరాడేవారికే టికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణపై వ్యాఖ్యలు చేసిన తేజస్వీ సూర్యపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు స్పందించకపోవడాన్ని తప్పుపట్టారు. తమ పార్టీ ఎంపీలు ఉంటే పార్లమెంట్‌లో తీవ్రంగా ప్రతిస్పందించేవారమని పేర్కొన్నారు.
హైదరాబాద్ అంశంపై గతంలో ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రాజీపడలేదని ఆయన గుర్తు చేశారు. పార్టీ ఓటమిపై ఆత్మపరిశీలన అవసరమని, సభ్యత్వం ఎక్కువగా ఉండటం కంటే నాణ్యత ముఖ్యమని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో పార్టీ ఓటమిపై విచారం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ నాయకులపై అక్రమాలు, భూకబ్జాల ఆరోపణలు చేశారు. ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సభ్యత్వ నమోదు చేపడతామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సభ్యత్వ రుసుమును సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యత్వానికి రూ.50గా నిర్ణయించారు. రైతుల పంటల కొనుగోలు, మహిళా రిజర్వేషన్ల అమలుపై పార్టీ తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు.



# కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం
- ప్రతిపక్షంగా సాధించిన విజయాలపై సమీక్ష
- పార్టీ శ్రేణులతో విస్తృత చర్చలు

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన కొనసాగుతోంది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం అందిస్తున్నారు. ప్రతిపక్షంగా పార్టీ చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల్లోకి వెళ్లిన తీరు వంటి అంశాలపై సమీక్ష జరుగుతోంది. సమావేశంలో బీఆర్ఎస్ ప్రతిపక్షంగా సాధించిన విజయాలు, ప్రజల సమస్యలపై చేపట్టిన పోరాటాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజలతో అనుసంధానం పెంచే విధానాలపై కూడా నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ వ్యూహాలపై విస్తృతంగా చర్చలు కొనసాగుతున్నాయి.
ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సహా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు హాజరయ్యారు. పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ సభ్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.
అదనంగా మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు, విద్యార్థి సంఘం నాయకులు కూడా సమావేశానికి హాజరయ్యారు. పెద్ద ఎత్తున నాయకులు పాల్గొనడంతో సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ బలోపేతం, క్షేత్ర స్థాయి కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేసీఆర్ సూచించినట్లు సమాచారం.
ప్రజల సమస్యలను మరింత బలంగా లేవనెత్తే విధంగా కార్యాచరణ రూపొందించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశం ద్వారా రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ రాజకీయ వ్యూహాలు మరింత స్పష్టత పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కార్యకలాపాలకు ఈ సమావేశం దిశానిర్దేశకంగా నిలుస్తుందని విశ్లేషిస్తున్నారు.

# తెలంగాణ కోసం మరోసారి పోరాటం: కేటీఆర్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన ఘనత కూడా తమదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా కోట్లాది ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ స్వీయ రాజకీయ అస్థిత్వానికి ప్రతీకగా గులాబీ జెండా నిలుస్తుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలతో విడదీయలేని బంధాన్ని ఈ జెండా సూచిస్తుందని చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిస్వార్థంగా పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో సాగిన రెండున్నర దశాబ్దాల ప్రయాణం చారిత్రాత్మకమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి పోరాటం, ప్రతి మలుపు తెలంగాణ చరిత్రలో చెరగని గుర్తుగా నిలిచిందన్నారు. త్యాగాలు, బలిదానాలతో సాధించిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదేనని చెప్పారు.
ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, తెలంగాణ విధ్వంసం దిశగా వెళ్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మరోసారి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తిరిగి పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు.
తెలంగాణ రక్షణ కోసం మరోసారి తెగించి పోరాడాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ప్రజల ఆశయాలను కాపాడే బాధ్యత పార్టీపై ఉందని, అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు పునరంకితం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి పొంగులేటి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి ప్రయోజనం చేరేలా వ్యవస్థ పనిచేయాలని చెప్పారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ వంటి రెవెన్యూ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు పెండింగ్ సమస్యలను క్లియర్ చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు. భూభారతి కార్యక్రమం అమలు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.
ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. అధికారులు తమ నివేదికలను సమర్పించి ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అందించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, భూ సమస్యల పరిష్కారం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. పథకాలు సమర్థవంతంగా అమలు కావడం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.






# అంబర్‌పేటలో మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి చర్యలు చేపట్టారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అదనపు ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సర్వీస్ సెంటర్ సమీపంలో నివాస సముదాయాలు ఉండటంతో మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని అధికారులు భావించారు. ముందస్తు జాగ్రత్తగా సమీప ఇళ్లలోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.
ఈ ఘటనలో సర్వీస్ సెంటర్‌లో ఉన్న పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. అగ్నిప్రమాదం వల్ల భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర కారణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. పరిస్థితిని పూర్తిగా నియంత్రణలోకి తెచ్చేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

# కవిత పార్టీపై తీన్మార్ మల్లన్న ఆరోపణలు

కవితేనా అనే ప్రశ్నను ముందుకు తెచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి పదవి పొందేందుకు కవిత ప్రయత్నించారని మల్లన్న ఆరోపించారు. ఈ విషయం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్వకుంట్ల తారక రామారావు కు తెలిసి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు దానిని ఆత్మగౌరవ పోరాటంగా చూపించడం సరైనది కాదని విమర్శించారు.
కాంగ్రెస్‌తో కవితకు సంబంధాలపై కూడా మల్లన్న ప్రశ్నలు లేవనెత్తారు. ఏఐసీసీకి చెందిన కీలక నేతతో కవిత సంబంధాలు ఉన్నాయా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. తెలంగాణ వాదం పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, కవిత కలిసి వ్యూహాలు రచిస్తున్నాయని మల్లన్న ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. ఈ ఆరోపణలపై కవిత, ఆమె పార్టీ నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుందో రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.





# వెల్టూర్ లో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**2పెద్దమందడి,ఏప్రిల్27( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2001 ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ స్థాపించబడిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రారంభమైన ఈ పార్టీ, ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ ఉద్యమాన్ని విజయవంతం చేసి 2014లో తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి దిశగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.రైతులు, పేదలు, మహిళలు, యువత కోసం అనేక పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు.రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లక్ సురేష్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మోజర్లలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పెద్దమందడి,ఏప్రిల్27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కే చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరికి సరైన ధర లభించేలా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించుకునేలా సౌకర్యాలు కల్పించామని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందిస్తున్న పథకాల ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొత్త కాపు రామకృష్ణారెడ్డి, మోజర్ల ఉప సర్పంచ్ ఆర్ రాములు, మద్దిగట్ల గ్రామ సర్పంచ్ ఎం రాములు, ఉప సర్పంచ్ రవి, పెద్దమందడి సింగిల్ విండో ప్రతినిధులు జగదీశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సత్య రెడ్డి, వెంకటస్వామి, భగవంతు రెడ్డి, సింగం కృష్ణయ్య, మేకల రాములు, ఆడం ఆంజనేయులు, కావల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# శాలపల్లి గ్రామంలో విషాదం అందె శ్యామ్ కుటుంబానికి పరామర్శ

**వేలేరు, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన అందె శ్యామ్ కుటుంబాన్ని వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ పరామర్శించారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో అందె శ్యామ్ మృతి చెందగా, విషయం తెలుసుకున్న సద్దాం హుస్సేన్ ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో వేలేరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, 13వ వార్డు మెంబర్ అక్కల ప్రశాంత్, దామెర అశోక్, కుమార స్వామి, ప్రవీణ్, బబ్లూ, కిషోర్, శ్రీనివాస్, సలీం మాలిక్, గ్రామ పెద్దలు, కుల సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# గుంతలు, మురుగునీరు ఇదేనా అభివృద్ధి ముఖచిత్రం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఎల్కతుర్తి-దామెర రహదారిపై చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులు సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ అసంపూర్తిగానే ఉండి నత్తనడకన సాగుతున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రారంభమైన ఈ పనులు ఇంకా పూర్తికాకపోవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

రహదారి పక్కన తవ్విన డ్రైనేజీ గుంతలు అలాగే వదిలేయడంతో అవి పూర్తిగా నీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. ఇండ్లకు సమీపంలోనే ఈ గుంతలు ఉండటంతో చిన్నపిల్లలు అనుకోకుండా అందులో పడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా పనులు వదిలేయడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది.

ఇక బస్టాండ్ పరిసర ప్రాంతంలో డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో మురుగునీరు అక్కడే నిలిచిపోతోంది. నిలిచిన ఈ నీరు మెయిన్ రోడ్డుపైకి రావడం గమనార్హం. డ్రైనేజీ లైన్లు పూర్తి కాలేకపోవడం వల్ల నీటి పారుదల సక్రమంగా జరగడం లేదు.

అలాగే నీటితో నిండిన గుంతల కారణంగా రాత్రి వేళల్లో చింతలపల్లి, దామెర గ్రామాలకు వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చీకటిలో గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రమాద పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు అంటున్నారు.

“పనులు ప్రారంభించడమే తప్ప పూర్తి చేయాలనే బాధ్యత ఎవరిది?” అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ మార్పు కనిపించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గుంతలు, మురుగునీరు, అసంపూర్తి పనులు——ఇవి తాత్కాలిక సమస్యలా? లేక నిర్లక్ష్యానికి నిదర్శనమా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదకరంగా ఉన్న గుంతలను భద్రపరచడంతో పాటు డ్రైనేజీ, రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# బంకులు మూత.. వాహనాలు నిలిచిపోయే పరిస్థితి

- **జమ్మికుంటలో పెట్రోల్ దొరకడంలేదు.**

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**





ఉమ్మడి జమ్మికుంట మండలంలో ఇంధన కొరత రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే రెండు రోజులుగా డీజిల్ కొరతతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు, సోమవారం నుంచి పెట్రోల్ కొరత కూడా తోడవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. జమ్మికుంట, ఇల్లంతకుంట మండలాల్లో దాదాపు అన్ని పెట్రోల్ బంకులు ఇంధనం పూర్తిగా అయిపోవడంతో తాత్కాలికంగా మూతపడిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

జమ్మికుంట పట్టణంలోని కొన్ని బంకుల వద్ద పెట్రోల్ అందుబాటులో ఉంటుందన్న సమాచారం రావడంతో తెల్లవారుజాము నుంచే వాహనదారులు భారీగా చేరుకుంటున్నారు. బైకులు, కార్లు, ఆటోలు పొడవాటి క్యూలుగా నిలబడటంతో ట్రాఫిక్ కూడా స్తంభిస్తోంది. గంటల తరబడి వేచి చూసిన తర్వాత కూడా చాలామందికి ఇంధనం దొరకక నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొంతమంది అయితే బంకుల మధ్య తిరుగుతూ ఇంధనం కోసం ఆందోళన చెందుతున్నారు.

ఈ కొరత ప్రభావం అత్యవసర సేవలపైనా పడుతోంది. రైతులు వ్యవసాయ పనులకు డీజిల్ దొరకక ఇబ్బంది పడుతుండగా, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు తమ దినసరి ఆదాయం కోల్పోతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెట్రోల్ బంకు నిర్వాహకుల ప్రకారం, సరఫరాలో తాత్కాలిక అంతరాయం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. డిపోల నుంచి సరుకు రాక ఆలస్యం కావడంతో నిల్వలు త్వరగా అయిపోయాయని వారు చెబుతున్నారు. త్వరలోనే సరఫరా పునరుద్ధరించబడుతుందని, పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుందని వారు వెల్లడించారు.

అయితే, స్థానిక ప్రజలు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైనంత ఇంధన నిల్వలు ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇకపై కూడా సరఫరా ఆలస్యం అయితే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి...

- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 27(తెలంగాణ ముచ్చట్లు )**





ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కొణిజెర్ల గ్రామానికి చెందిన సిహెచ్. రామ లక్ష్మణులు దరఖాస్తు సమర్పిస్తూ, అధికారిక దుర్వినియోగానికి పాల్పడుతున్న కొణిజెర్ల గ్రామ పంచాయతీ పాలక వర్గంపై చర్యలు తీసుకోవాలని కోరగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఏన్కూరు గ్రామ ప్రజలు గ్రామం పరిధిలో గల చెరువు క్రింద వరి పొలాలు కలిగిన రైతులు వర్షం వచ్చినప్పుడు చెరువు నిండి పొలాల్లో 4 అడుగుల వరకు నీరు నిలిచి వరి పంట నష్టపోతున్నా మని, ఏన్కూరు నుండి గార్ల ఒడ్డు వరకు కొత్తగా పోసే రోడ్డుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న దగ్గర మోరీలు కట్టాలని, రోడ్డు ప్రక్కన కాలువ తీయాలని, కాల్వ వెడల్పు చేయటం కొరకు దరఖాస్తు చేసుకోగా డిపిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కొణిజెర్ల మత్స్య శాఖ సొసైటీ అధ్యక్షులు రెడ్డి బోయిన వెంకన్న గ్రామంలో ఉన్నటు వంటి ఊరు చెరువు, చీకటి చెరువులు భూ కబ్జాకు గురవుతున్న విషయం గురించి ఫిర్యాదు చేస్తూ వీటిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

మధిరలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి పిహెచ్సి సబ్ సెంటర్ ను కొత్త బిల్డింగ్ నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాత భవనానికి షిఫ్ట్ చేయడం గురించి దరఖాస్తు చేసుకోగా డీఎంహెచ్ఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల కోసం బిఆర్ఎస్ నిరంతర పోరాటం

- **మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్**

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉందని మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి మండలంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన త్యాగాలు, పోరాటం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తెలంగాణపై జరిగిన వివక్షను ఎదుర్కొని, సబ్బండ వర్గాల ప్రజలను ఏకం చేసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి అండగా నిలవడంలో బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగేడ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, మాజీ మండల అధ్యక్షులు యేల్పూరి స్వామి, పోరెడ్డి రవీందర్ రెడ్డి, కడారి రాజు, గొల్లె మహేందర్, గుండేటి సతీష్, కొమ్మిడి మహిపాల్ రెడ్డి, సాతూరి శంకర్, మదార్, మునిగడప లావణ్య, శేషగిరి, అంబాల రాజ్ కుమార్, బొంకూరి రజిత, అంబాల అనిల్, మేకల బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టితే కఠిన చర్యలు

- ఏసీపీ మాధవి హెచ్చరిక




**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలో రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఏసీపీ వి. మాధవి గారు గంభీరంగా స్పందించారు. ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులపై వరి పోయడం, టార్పాలిన్ కవర్లు, బండరాళ్లు అడ్డంగా ఉంచడం వలన వాహనదారులు అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రమాదాల్లో ముఖ్యంగా రైతు సోదరులే బలవుతుండడం ఆందోళనకరమని ఆమె తెలిపారు. కొందరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్ర గాయాలతో జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, పలువురు కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

"కొన్ని నిమిషాల సౌకర్యం కోసం రహదారులపై ధాన్యం ఆరబెట్టడం... ఒక కుటుంబానికి జీవితాంతం బాధను మిగల్చే ప్రమాదంగా మారుతోంది" అని హెచ్చరిస్తూ, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

రైతులు తప్పనిసరిగా వరి ధాన్యాన్ని కల్లాల వద్ద లేదా తమ ఇళ్ల ప్రాంగణాల్లోనే ఆరబెట్టుకోవాలని, రహదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని సూచించారు. అవసరమైతే గ్రామ పంచాయతీ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే ఆరబెట్టాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారులపై ఎలాంటి అడ్డంకులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ మాధవి గారు స్పష్టం చేశారు. రహదారులపై ధాన్యం పోసిన వారికి నోటీసులు జారీ చేయడం, అవసరమైతే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రమాదాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

చివరిగా, "ప్రాణాల కంటే ధాన్యం ముఖ్యమేమీ కాదు" అని పేర్కొంటూ, రైతు సోదరులు పోలీసు శాఖ విజ్ఞప్తిని గౌరవించి రహదారి భద్రత కోసం సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# వడ్ల కొనుగోలు కేంద్రంతో రైతులకు ఆర్థిక భరోసా

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పంట పండించిన తర్వాత సరైన ధర దక్కక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది ఒక పెద్ద ఊరటనిచ్చే నిర్ణయంగా మారింది.

ఇప్పటివరకు మధ్యవర్తుల ఆధీనంలో తమ పంటను విక్రయించాల్సి వచ్చిందని, దీంతో కనీస మద్దతు ధర కూడా అందక నష్టపోయామని రైతులు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రం ద్వారా ఇకపై నేరుగా ప్రభుత్వానికే ధాన్యం విక్రయించే అవకాశం కలగడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

ఈ కేంద్రం ప్రారంభంతో రైతులు తమ పంటను గ్రామంలోనే విక్రయించుకోవచ్చు. దీని వల్ల రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ముఖ్యంగా చిన్న మరియు మధ్య తరగతి రైతులకు ఇది మరింత ప్రయోజనకరంగా మారనుంది. పంటను నిల్వ ఉంచడం, సరైన ధర కోసం ఎదురుచూడడం వంటి సమస్యలు కూడా తగ్గనున్నాయి. రైతులు ఈ కేంద్రంపై హర్షం వ్యక్తం చేస్తూ, "మాకు కనీస మద్దతు ధర లభించడం వల్ల ఆర్థికంగా కొంత స్థిరత్వం వస్తుంది. మధ్యవర్తుల బెడద లేకుండా పంటను విక్రయించుకోవడం మాకు పెద్ద ఉపశమనం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోనే ఇలాంటి సదుపాయం అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# వేలేరు మండల కేంద్రంలో పెట్రోల్, డీజిల్ భారీ కొరత



**వేలేరు, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో గత కొద్ది రోజులుగా పెట్రోల్ మరియు డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఇంధనం అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల పెట్రోల్ బంకుల వద్ద వాహనాల క్యూలు కిలోమీటర్ల మేరకు కొనసాగుతున్నాయి.

ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడటం, డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. కొంతమంది బంకుల్లో పూర్తిగా స్టాక్ లేకపోవడంతో "నో స్టాక్" బోర్డులు పెట్టడం గమనార్హం.

ఈ సమస్య కారణంగా రవాణా వ్యవస్థపై కూడా ప్రభావం పడుతోంది. ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఇది ఇలా ఉండగా బయట వ్యాపారులు మాత్రం పెట్రోల్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వాహనదారులు చెపుతున్నారు.

స్థానిక ప్రజలు మరియు వాహనదారులు వెంటనే ఇంధన సరఫరా పునరుద్ధరించాలని అధికారులను కోరుతున్నారు. సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





# చిల్పూర్ మండలంలో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఇంచార్జ్ రమేష్ నాయక్
- ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ రమేష్ నాయక్ పిలుపు

**చిల్పూర్,ఏప్రిల్27(తెలంగాణ ముచ్చట్లు):**

బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్పూర్ మండల కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జి మాలోతు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జి రమేష్‌నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రమేష్ నాయక్ మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతను ఆకర్షిస్తూ సంస్థాగతంగా బలమైన నిర్మాణాన్ని ఏర్పరచాలని సూచించారు. మండల స్థాయిలో సమన్వయం పెంచి, ప్రతి బూత్‌లో పార్టీ పట్టు పెరగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై చురుకుగా స్పందిస్తూ ప్రజలకు చేరువ కావడం ద్వారానే పార్టీ బలం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు, మారాపాక రమేష్, పొగాకుల విష్ణు వర్ధన్, మాజీ సర్పంచ్ వడ్లూరి మమత వెంకటేష్, చుక్క రాజేష్, గడ్డమీది మహేందర్, మోటం వెంకన్న, భూక్యా విజయ్, ఎడ్ల మహిపాల్, సాధం విష్ణు, బిక్షపతి, బుస యాదగిరి, బట్టు రెడ్డి, పల్లె అంజి, మాలోతు గాంధీ, భూక్యా వరుణ్ సహా మహిళలు పాల్గొన్నారు.

# సిగ్నల్ కష్టాలకు చెక్..

- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సరికొత్త లక్ష్యం
- మారుమూల పల్లెల్లో నెట్‌వర్క్ విప్లవానికి నాంది
- కేంద్ర టెలికాం శాఖ కార్యదర్శికి విజ్ఞప్తి
- మూడు జిల్లాల్లో 25 కొత్త బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదన

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 27(తెలంగాణ ముచ్చట్లు )**

ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న మొబైల్ నెట్‌వర్క్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఖమ్మం ఎంపీ, కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సభ్యులైన రామసహాయం రఘురాం రెడ్డి నడుం బిగించారు. 'డిజిటల్ ఇండియా'లో భాగంగా ప్రతి పల్లెకు హైస్పీడ్ ఇంటర్నెట్ చేరాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా 25 కొత్త బీఎస్ఎన్ఎల్ (4జి /5జీ ) టవర్లను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర టెలికాం కార్యదర్శి అమిత్ అగర్వాల్‌ను సోమవారం ఢిల్లీ లో కలిసి విన్నవించారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల పూర్తి వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి అందజేశారు.

**మారుమూల పల్లెల్లో కమ్యూనికేషన్ కరువు**

నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాలు, ఎల్‌డబ్ల్యూఈ (మావోయిస్టు ప్రభావిత) ప్రాంతాలు మరియు సరిహద్దు గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ప్రభుత్వ సేవలు పొందే సామాన్యులకు ఈ నెట్‌వర్క్ సమస్య పెద్ద అడ్డంకిగా మారిందని వివరించారు. ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**25 గ్రామాల్లో కొత్త టవర్ల కోసం ప్రతిపాదన**

నియోజకవర్గ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంతో పాటు సరిహద్దు జిల్లా అయిన మహబూబాబాద్‌ను కలిపుకొని మొత్తం 25 సమస్యాత్మక ప్రాంతాల జాబితాను ఎంపీ అందజేశారు.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** అశ్వారావుపేట మండలంలోని కొత్త కన్నాయిగూడెం, కాంట్లం, చెన్నపురం, పాల్వంచ మండలంలోని మందారికాలపాడు, కారేగట్టు, సారెకల్లు, మొండికట్ట, రెడ్డిగూడెం, ములకలపల్లి మండలంలోని పాత గుండాలపాడు, గండిప్రోలు గ్రామాల్లో టవర్లు అవసరమని పేర్కొన్నారు.

**ఖమ్మం జిల్లా:** ఖమ్మం రూరల్ (కస్నా తండా), మధిర (నిధానపురం), ముదిగొండ (పమ్మి), కల్లూరు (వెన్నవల్లి), బోనకల్ (గోవిందాపురం ఎల్), ఎన్కూర్ (జన్నారం), వైరా (రెబ్బవరం), చింతకాని (నేరడ), రఘునాథపాలెం (పంగిడి), పెనుబల్లి (టేకులపల్లి) ప్రాంతాలను ప్రతిపాదించారు.

**మహబూబాబాద్ జిల్లా:** బయ్యారం మండలంలోని మిర్యాలపెంట, కొయ్యగూడెం, తిమ్మపురం, వెంకటాపురం, జగత్రావుపేట గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఈ ప్రాంతాల్లో 4జీ, 5జీ సేవలు అందుబాటులోకి వస్తే గిరిజన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడతాయని ఎంపీ రఘురాం రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన టెలికాం కార్యదర్శి... రాష్ట్ర టెలికాం అడిషనల్ డీజీతో మాట్లాడి ఎంపీ సూచించిన 25 టవర్ల ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.





# జమ్మికుంటలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

- జెండా ఆవిష్కరణల్లో మున్సిపల్ చైర్మన్.

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణం ఉత్సాహభరితంగా మారింది. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని 23, 12వ వార్డుల్లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

కార్యక్రమం సందర్భంగా పార్టీ కార్యకర్తలు నినాదాలతో సందడి చేయగా, పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. "ఆనాడు కేసీఆర్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారం అయింది" అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులో కూడా అదే దిశగా ముందుకు సాగుతుందని ఆయన చెప్పారు. జమ్మికుంట ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచూ రమాదేవి, వార్డు అధ్యక్షులు పసునూటి శ్రీకాంత్, నాగపురి శ్రీనివాస్, ఉడుత రమేష్, ఎండీ అమీర్, దేవరాజు నదీమ్, జాఫర్, నజీర్, ఖాజా, శివ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# హుజురాబాద్ కో-ఆప్షన్‌లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

- నాలుగింటినీ కైవసం

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం నాలుగు స్థానాల్లో నాలుగింటినీ దక్కించుకుని పార్టీ శక్తిని చాటింది. హుజురాబాద్ రాజకీయ చరిత్రలో మున్సిపల్ స్థాయిలో తొలిసారి కాంగ్రెస్ పార్టీ ఈ స్థాయి ఆధిపత్యం సాధించడం విశేషంగా మారింది. ఈ విజయానికి నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కీలక పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎంపిక ప్రక్రియలో సమతుల్యం పాటిస్తూ బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించడమే కాకుండా మహిళలకు రెండు స్థానాలు కేటాయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా యువనేత ప్రణవ్ తన నాయకత్వాన్ని మరోసారి నిరూపించుకున్నారని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



కోఆప్షన్ సభ్యులుగా గొట్టే జమదగ్ని, మహమ్మద్ అబ్దుల్ అలీం, ఆలేటి సుశీల, ఫరీద బేగం ఎంపికయ్యారు. ఈ మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ వొడితల ప్రణవ్ ముందుండి నడిపించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, ఈ విజయానికి సహకరించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ బొమ్మ , జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్ , దుద్దిల్లా శ్రీధర్ బాబు , ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరావు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి లభించిన ఈ విజయం హుజురాబాద్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టి.ఎస్



**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 27(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా కలెక్టర్ గా దివాకర టి.ఎస్. సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న దివాకర టి.ఎస్. ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

ఖమ్మం కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ను అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.




## ప్రముఖుల పేరుతో మోసం

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. తాజాగా జూబ్లీహిల్స్ పరిధిలో ఇలాంటి మోసం వెలుగులోకి వచ్చింది. పురిమెట్ల బంగారు యాదవ్ అనే వ్యక్తి ఓ ఇన్‌ఫ్రాటెక్ సంస్థను లక్ష్యంగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం, జూబ్లీహిల్స్‌కు చెందిన గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ సంస్థ డైరెక్టర్ బొడ్డు అశోక్ ను నిందితుడు సంప్రదించాడు. దుండిగల్ ప్రాంతంలో చేపట్టే ప్రాజెక్టుకు అనుమతులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ నేతలతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతూ నిందితుడు బాధితుడిని మోసం చేశాడు. ముఖ్యంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి తో తనకు దగ్గరి పరిచయం ఉందని చెప్పి విశ్వాసం పొందాడు.

ఈ నమ్మకంతో వివిధ విడతల్లో సుమారు రూ.1.70 కోట్ల నగదు, ఒక అల్కజర్ కారు, ఖరీదైన మొబైల్ ఫోన్‌ను నిందితుడు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 18 నెలల పాటు ప్రాజెక్టు ఇప్పిస్తానంటూ కాలయాపన చేశాడు. చివరికి అనుమానాస్పద సమాధానాలు చెప్పడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రముఖుల పేర్లు చెప్పి మోసం చేసే వారిపై నమ్మకం ఉంచే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని హెచ్చరిస్తున్నారు.



## నూతన బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డి

- సచివాలయంలో మర్యాదపూర్వక భేటీ
- కమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు
- ఐఅండ్‌పీఆర్, ఎఫ్‌డీసీకి కొత్త అధికారి

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సచివాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖకు కొత్త అధికారి నియామకం జరిగింది. ఐఅండ్‌పీఆర్ కమిషనర్, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి ముకుంద రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డికి మంత్రి అభినందనలు తెలిపారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి శాఖ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సమాచార సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఐఅండ్‌పీఆర్ శాఖ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. పారదర్శకత, సమయోచిత సమాచార పంపిణీ ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెంపొందించవచ్చని తెలిపారు. ఎఫ్‌డీసీ సంస్థ అభివృద్ధి, సినీ పరిశ్రమకు మద్దతు, సౌకర్యాల విస్తరణ వంటి అంశాల్లో కూడా కొత్త అధికారి దృష్టి సారించాలని సూచించారు. ఈ రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అన్నారు. ఈ భేటీలో అధికారులు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. శాఖలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని నిర్ణయించారు. ముకుంద రెడ్డి బాధ్యతల స్వీకారం నేపథ్యంలో ఐఅండ్‌పీఆర్, ఎఫ్‌డీసీ శాఖల్లో కొత్త దిశలో మార్పులు రావచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, ప్రజా సేవల్లో మరింత చురుకుదనం పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం

- గవర్నర్ కోటాలో నామినేషన్ ద్వారా కీలక మార్పులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కార్యక్రమం
- రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న వేడుక








**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత కలిగిన పరిణామంగా మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన వీరికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన చాంబర్‌లో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో పాల్గొనడం ద్వారా ప్రభుత్వం ఈ నియామకాలకు ఇచ్చిన ప్రాధాన్యత స్పష్టమైంది. గవర్నర్ కోటాలో జరిగిన ఈ నియామకాలు శాసనమండలి రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఈ సందర్భంగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి పాల్గొని కొత్త ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. అలాగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇతర ప్రజాప్రతినిధుల్లో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా హాజరై అభినందనలు తెలిపారు. ఈ వేడుక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రమాణ స్వీకారం అనంతరం అజారుద్దీన్, కోదండరాం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని, శాసన మండలిలో ప్రజల వాణిగా నిలుస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి అంశాలపై మరింతగా పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. గవర్నర్ కోటాలో జరిగిన ఈ నియామకాలు ప్రభుత్వానికి శాసనమండలిలో మరింత బలం చేకూర్చే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. భవిష్యత్తులో విధానాల అమలు, చర్చల్లో ఈ సభ్యుల పాత్ర కీలకంగా ఉండబోతోందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఓటరు జాబితా సవరణపై వేగం పెంచాలని ఆదేశాలు

- మల్కాజిగిరిలో సమీక్షా సమావేశం నిర్వహణ
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరణపై దృష్టి
- వారంలో మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచనలు



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగవంతం చేసేందుకు ఎన్నికల అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు ముఖ్య ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు. 2025 ఓటరు జాబితాలో అర్హులైన ఓటర్లందరినీ 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేయాలని అదనపు సీఈఓ సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

పట్టణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని అధికారులు గుర్తించారు. దీనిపై స్పందించిన అదనపు సీఈఓ, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని ఆదేశించారు. వారం రోజుల్లోనే మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన గడువు నిర్దేశించారు. మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏల సహకారం తీసుకోవాలని సూచించారు. అలాగే నివాస కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంచిత్ గంగ్వార్, జోనల్ కమిషనర్ హోదాలో పాల్గొన్నారు. మున్సిపల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, తహసీల్దారులు, సహాయక కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు కూడా హాజరయ్యారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా సహకరించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మంలో దారుణం



- భర్త, కూతురిని చంపిన రమ్య...?
- మూడు రోజులుగా మృతదేహాలతో...

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 27(తెలంగాణ ముచ్చట్లు )**

ఖమ్మం మామిళ్ళ గూడెం లో దారుణం చోటుచేసుకుంది.ఓ ఇంట్లో తండ్రీ కుమార్తె మృతి చెందగా తల్లి మరో కూతురు అపస్మారక స్థితిలో ఉండడాన్ని ఆదివారం రాత్రి పోలీసులు గుర్తించారు. అయితే తండ్రీ కుమార్తె మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు అనుమానం వ్యక్తమవుతుండగా భార్యే హత్య చేసి ఉంటుందని సందేహిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనంతనగర్ కి చెందిన కణతాల రాము (36) ఓ డిజిటల్ పత్రికలో విలేకరి గా పని చేస్తూ భార్య రమ్య(31) కుమార్తెలు దివ్య(5) దీక్షిత(3)తో కలిసి మామిళ్ళ గూడెం సాయి బాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. నాలుగైదు రోజులుగా రాముకు ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేసిన ఎత్తకపోగా ఆయన భార్య రమ్య ఫోన్ ఎత్తి ఆయనకు ఆరోగ్యం బాగా లేక తాను మాట్లాడుతున్నట్లు చెబుతోంది. ఆదివారం ఉదయం ఒక మహిళ రమ్య ఇంటికి వచ్చి పిలవగా రమ్య దుప్పటి కప్పుకుని బయటకు వచ్చి రాము అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు చెప్పింది. ఇంట్లో దుర్వాసనపై ఆరా తీయగా ఇంట్లో ఎవరికీ బాగాలేకపోవడంతో శుభ్రం చేయలేదని బదులిచ్చింది. కాగా ఆదివారం రాత్రి రమ్య సోదరుడు వీరి ఇంటికి వచ్చి తలుపు కొట్టగా స్పందన లేకపోవడం దుర్వాసన వస్తుండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా మంచం కింద రాము కూతురు దివ్య మృతదేహాలు కనిపించాయి. గది నిండా రక్తం కారి ఉంది. అప్పటికే ఇద్దరి మృతదేహాలు కుళ్లిపోయి కనిపించాయి. మంచం పక్కనే రమ్య చిన్నకూతురు దీక్షిత అపస్మారక స్థితిలో ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.


**మూడు రోజులుగా మృతదేహాలతో**

మూడు రోజులపాటు మృతదేహాలతో ఇంట్లోనే రమ్య ఉన్నా అబద్ధం ఆడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భర్త కుమార్తెను హత్య చేసి గుట్టురట్టు కాకుండా ఎలుకల మందు కాస్త తాగి చిన్న కూతురుకు కూడా తాగించి ఉంటుందని భావిస్తున్నారు. అంతేకాక చిన్న కూతురు తలపై గాయాలు ఉండటంతో ఆమెను కూడా హత్య చేయడానికి పథకం రూపొందించి ఉంటుందని భావిస్తున్నారు. మూడు రోజుల క్రితమే వారు మృతి చెందితే భయపడి తాను బయటకు చెప్పలేదని అంగీకరించినా కారణాలు చెప్పడానికి మాత్రం రమ్య నిరాకరించినట్లు తెలిసింది.

# అధికారుల నిర్లక్ష్యం... వర్షా నికి తడిసిన ధాన్యం

- రైతుల నష్టానికి ఎవరు బాధ్యులు?

**వేలేరు, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు మండలం పీచర గ్రామంలో ఐకేపి సెంటర్లలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడింది. సోమవారం కురిసిన వర్షంతో రైతులు కష్టపడి ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిముద్దవగా, దీనికి కారణం కొనుగోళ్లు ప్రారంభించకుండా కాలయాపన చేసిన సంబంధిత అధికారులే అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెంటర్ ప్రారంభించి మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సుమారు 25 మంది రైతులకు భారదాన్ ఇచ్చి సంచుల్లో నింపించిన ధాన్యాన్ని కూడా తరలించకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది.

వర్షం పడే సూచనలు ఉన్నప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా అధికారులు వర్షాలు వచ్చేసమాయానికి రైతులకు ఉపయోగపడేలా ఐ కే పి నిర్వాహకులకు 25 నుండి 30 పరదాలను ఇచ్చినట్లు చెపుతున్నారు కానీ రైతులు ఇవ్వమని అడిగితె ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టి డంపింగ్ చేయాలని చెప్పడం రైతులపై ద్వంద్వభారం మోపినట్టే అవుతోంది. ఇలా రైతులు నష్టపోతుంటే అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు గురవుతోంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని లేకపోతే ఆందోళనలు తప్పవని రైతులు హెచ్చరిస్తున్నారు.

# హుజురాబాద్‌లో కూరగాయల అమ్మకాలు బంద్

- దంపు యార్డు వ్యతిరేకంగా నిరసనలు ఉధృతం



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో కూరగాయల వ్యాపారస్తులు, రైతులు సోమవారం ఉదయం నుంచి కూరగాయల అమ్మకాలను పూర్తిగా నిలిపివేశారు. హుజురాబాద్ శివారులోని సిర్సపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న డంపు యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్ష సోమవారానికి 36వ రోజుకు చేరుకుంది.

ఈ నిరసనలకు మద్దతుగా కూరగాయల వ్యాపారస్తులు, రైతులు వినూత్నంగా స్పందించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూరగాయల విక్రయాన్ని బంద్ చేసి తమ ఐక్యతను చాటారు. దీంతో పట్టణంలో కూరగాయల మార్కెట్లు మూతపడ్డాయి. డంపు యార్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు కలిసి చేపట్టిన ఈ నిరసన ఉద్యమం మరింత ఉధృతమవుతోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కేజ్రీవాల్ కొత్త వివాదం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు ):** అరవింద్ కేజ్రీవాల్ నేత కేజ్రీవాల్ మరోసారి వివాదాస్పద నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ఢిల్లీ ఎక్సైజ్ శాఖ కేసులో తాను వ్యక్తిగతంగా కానీ, తన తరఫున న్యాయవాది ద్వారా కానీ కోర్టుకు హాజరుకానని ప్రకటించారు. ఈ విషయాన్ని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వరాణ కాంత శర్మ కు లేఖ ద్వారా తెలియజేశారు. తన నిర్ణయం కోపంతో తీసుకున్నది కాదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. బాధతో, వినయంతో తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. తన అంతరాత్మ చెప్పిన దారి ప్రకారం వ్యవహరిస్తున్నానని ఆయన తెలిపారు. అయితే న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని కూడా అన్నారు.

సాధారణ పౌరులు న్యాయ ప్రక్రియలో ఎదుర్కొనే ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడమే తన లక్ష్యమని కేజ్రీవాల్ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ఆ సమస్యలపై దృష్టి సారించాలని ప్రయత్నిస్తున్నానని చెప్పారు. ఇటీవల ఈ ఎక్సైజ్ కేసులో జస్టిస్ స్వరణ కాంత శర్మను విచారణ నుంచి తప్పించాలని కేజ్రీవాల్ అభ్యర్థించారు. అయితే ఆయన వినతిని హైకోర్టు ఏప్రిల్ 20న తిరస్కరించింది. దీంతో ఈ అంశం మరింత వివాదాస్పదంగా మారింది.అఖిల భారతీయ అధివక్త పరిషత్ కార్యక్రమాల్లో న్యాయమూర్తి పాల్గొంటున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆ సంస్థకు అధికార ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని పేర్కొంటూ, తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు. ఈ కేసులో ఎలాంటి పరిణామాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తన పోరాటం గాంధేయ సత్యాగ్రహం తరహాలో కొనసాగుతుందని వెల్లడించారు.

# ఆప్‌కు భారీ దెబ్బ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు ):** అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమైన ప్రక్రియకు రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో రాజ్యసభలో ఆప్ బలం గణనీయంగా తగ్గిపోయింది.

రాజ్యసభ అధికారిక గణాంకాల ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న సభ్యుల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇదే సమయంలో బీజేపీ సభ్యుల సంఖ్య 106 నుంచి 113కు పెరిగింది. ఇక ఎన్డీఏ కూటమి మొత్తం బలం 141 నుంచి 148కు చేరింది. మెజారిటీ మార్క్ అయిన 123కు బీజేపీ మరింత దగ్గరైంది. బీజేపీలో చేరిన ఎంపీలు సమర్పించిన విలీన లేఖపై ఛైర్మన్ న్యాయపరమైన అభిప్రాయం తీసుకున్నట్లు సమాచారం. ఆ లేఖపై ఏడుగురు ఎంపీలు సంతకాలు చేశారు. ఆప్ రాజ్యసభ సభ్యుల్లో రెండు మూడవ వంతు మెజారిటీ ఈ నిర్ణయానికి మద్దతు ఇవ్వడంతో విలీనానికి న్యాయపరంగా అడ్డంకులు లేకుండా పోయాయి. బీజేపీలో చేరిన ఎంపీలలో రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తా ఉన్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ నిబంధనలకు అనుగుణంగా ఈ విలీనం జరిగిందని ఛైర్మన్ భావించినట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం రెండు మూడవ వంతు సభ్యుల మద్దతు ఉంటే విలీనాన్ని ఆమోదించవచ్చు. దీంతో ఈ ప్రక్రియకు పూర్తి చట్టబద్ధత లభించినట్లైంది. మరోవైపు ఈ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ముందుగా రాజ్యసభ ఛైర్మన్‌ను కోరింది. అయితే తాజా పరిణామాలతో ఆ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ తగిలినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాకిస్థాన్‌లో ఉగ్ర నేత హత్య

- లష్కరే అగ్ర కమాండర్ అఫ్రీదీ కాల్పుల్లో మృతి
- ఉగ్రవాదులపై వరుస టార్గెట్ దాడులు
- భద్రతా పరిస్థితులపై అనుమానాలు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కీలక వ్యక్తులపై వరుస దాడులు కొనసాగుతున్నాయి. లష్కరే తోయిబా అగ్ర కమాండర్, హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడిగా భావించే షేక్ యూనస్ అఫ్రిదీ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో హతమయ్యాడు. సమీపం నుంచి జరిపిన కాల్పుల్లో అఫ్రిదీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

గత కొంతకాలంగా పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కీలక నాయకులు, ప్రణాళికాదారులు టార్గెట్ అవుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గత నెలలో లాహోర్‌లో లష్కరే వ్యవస్థాపక సభ్యుడు అమీర్ హమ్జా పై కూడా దాడి జరిగింది. అయితే ఆయన తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలు ఉగ్రవాద సంస్థల అంతర్గత భద్రతపై ఆందోళనలు పెంచుతున్నాయి.

ముంబై 26/11 దాడుల ప్రధాన సూత్రధారి హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న అబు ఖతల్ (ఖతల్ సింధీ) గత ఏడాది ఇదే తరహాలో హతమయ్యాడు. ఈ తరహా ఘటనలు ఉగ్రవాద వర్గాల్లో అస్థిరతను సూచిస్తున్నాయి.

గత కొన్ని నెలల్లోనే లష్కరే, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలకు చెందిన కనీసం 30 మంది కీలక ఉగ్రవాదులు లాహోర్, కరాచీ వంటి నగరాల్లో అజ్ఞాత దుండగుల చేతిలో మృతి చెందారు. ఈ వరుస ఘటనలు పాకిస్థాన్‌లో భద్రతా పరిస్థితులపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

అదేవిధంగా, జైషే మహమ్మద్ అధిపతి మౌలానా మసూద్ అజార్ సోదరుడు తాహిర్ అన్వర్ కూడా ఇటీవల అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం గమనార్హం. ఈ పరిణామాలు ఉగ్రవాద సంస్థల భవిష్యత్తుపై అనిశ్చితిని మరింత పెంచుతున్నాయి.

# గల్ఫ్ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు ):** మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. శత్రువులు తమ ఒక చమురు బావిపై దాడి చేస్తే తాము నాలుగు చమురు బావులపై ప్రతిదాడులు చేస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాహెబ్ ఇస్ఫహానీ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా మూడు రోజుల్లో ఒప్పందానికి రావాలని హెచ్చరించిన విషయం తెలిసిందే. లేకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లను పేల్చేస్తామని ట్రంప్ పేర్కొన్నారు. చమురు ఇరాన్‌కు ప్రధాన ఆర్థిక వనరు కావడంతో దాన్ని లక్ష్యంగా చేసుకుంటే ఆ దేశం ఒత్తిడికి లోనవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఇరాన్ నేతలు, తమ మౌలిక సదుపాయాలపై ఎలాంటి దాడులు జరిగినా తీవ్ర ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా చమురు క్షేత్రాలు, పైప్‌లైన్లు లక్ష్యంగా చేసుకుంటే అమెరికాకు మద్దతు ఇస్తున్న దేశాల్లో నాలుగు రెట్లు ఎక్కువ విధ్వంసం సృష్టిస్తామని తెలిపారు. ఇరాన్ లెక్కలు ఇతర దేశాల్లా కాకుండా భిన్నంగా ఉంటాయని ఇస్ఫహానీ వ్యాఖ్యానించారు. శత్రువులు ఒక దాడి చేస్తే తాము నాలుగు దాడులతో ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రాంతీయ భద్రతపై మరింత ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆస్తులు కూడా లక్ష్యంగా మారవచ్చని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మొత్తంగా ఇరాన్-అమెరికా మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఇరు పక్షాల హెచ్చరికలు మరింత కఠినంగా మారుతుండటంతో, భవిష్యత్తులో పరిస్థితులు ఎటు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# మహారాష్ట్రలో ఎండల భగ్గుమంట

- అకోలాలో 46.9 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- విదర్భలో వడగాలుల తీవ్రత
- ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు



**ముంబై, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** మహారాష్ట్రలో ఎండలు తీవ్రరూపం దాల్చాయి. ముఖ్యంగా అకోలా జిల్లాలో దేశంలోనే అత్యధికంగా 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. నాగ్‌పూర్, విదర్భ ప్రాంతాల్లో కూడా తీవ్ర వడగాలులు వీచడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. మార్చి నెల నుంచే ప్రారంభమైన ఎండలు ఏప్రిల్‌లో మరింత పెరిగి, దాదాపు అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయాల్లో రోడ్లపై రాకపోకలు తగ్గిపోయాయి. రోజువారీ పనులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ఎండ తీవ్రతతో చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ వారం దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. నాగ్‌పూర్ వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సంవత్సరం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు చేరుకోవచ్చు. కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఇప్పటికే అమరావతి జిల్లాలో 46.8 డిగ్రీలు నమోదు కాగా, వార్ధాలో 46.4 డిగ్రీలు, యవత్మాల్‌లో 46 డిగ్రీలు నమోదయ్యాయి. నాగ్‌పూర్‌లో 45.4 డిగ్రీలు, చంద్రాపూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. విదర్భ ప్రాంతం మొత్తం తీవ్ర వడగాలుల ప్రభావంలో ఉందని వెల్లడించింది. ఈ వడగాలుల ప్రభావం మంగళవారం వరకు కొనసాగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని, నీరు ఎక్కువగా తాగాలని, తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం అని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాయి.

# భారత్-న్యూజిలాండ్ ఉచిత వాణిజ్య ఒప్పందం

- మహిళల ఆధ్వర్యంలో తొలి ఎఫ్‌టీఏగా గుర్తింపు
- భారత ఎగుమతులకు 100 శాతం సుంక రహిత ప్రవేశం
- పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలకు కొత్త దారి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్-న్యూజిలాండ్ మధ్య కీలక ఆర్థిక ఒప్పందానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇరు దేశాలు ఉచిత వాణిజ్య ఒప్పందం కు దుర్చుకున్నాయి. ఇది మహిళల ఆధ్వర్యంలో కుదిరిన తొలి ఎఫ్‌టీఏగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఒప్పందం నరేంద్ర మోదీ, క్రిస్ లక్సన్ నాయకత్వంలో అమలులోకి వచ్చింది. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే చర్చలు పూర్తి కావడం విశేషంగా నిలిచింది. ఈ ప్రక్రియలో న్యూజిలాండ్ వాణిజ్య మంత్రి టాడ్ మెక్లే సహా ఇరు దేశాల ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు.



ఈ ఒప్పందం ద్వారా భారత ఎగుమతులకు న్యూజిలాండ్ మార్కెట్లో 100 శాతం సుంక రహిత ప్రవేశం లభించనుంది. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, రైతులు, మహిళలు, యువత, నిపుణులకు ఇది భారీ అవకాశాలను అందించనుంది. ఉపాధి సృష్టి, వ్యాపార విస్తరణకు ఇది దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. అదేవిధంగా ఈ ఒప్పందం ద్వారా భారత్‌లోకి సుమారు 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వాణిజ్యం, సేవలు, ఆవిష్కరణలు, వ్యవసాయ ఉత్పాదకత, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుంది.

నైపుణ్య అభివృద్ధి, విద్యార్థుల అవకాశాలు, నిపుణుల మార్పిడి వంటి అంశాల్లో కూడా ఈ ఒప్పందం కీలక మార్పులకు దారితీయనుంది. సమతుల్య విధానాలతో భారత ప్రయోజనాలను కాపాడుతూ ఒప్పందం రూపొందించబడిందని అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఒప్పందం భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సమగ్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అభివృద్ధి భారత్ లక్ష్య సాధనలో ఇది మరో కీలక అడుగుగా నిలవనుంది.

# ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్‌తో ప్రధాని భేటీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ ను కలిశారు. ఈ భేటీ సందర్భంగా ఆయన చేసిన సేవలను ప్రధాని ప్రశంసించారు. ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ వ్యక్తిగత జీవిత ప్రయాణం ఎంతో ప్రేరణాత్మకమని ప్రధాని పేర్కొన్నారు. ఎదురైన ప్రతి సవాలు ఆయనను మరింత బలపరిచిందని, సమాజానికి సేవ చేయాలనే సంకల్పాన్ని పెంపొందించిందని తెలిపారు. ప్రజారోగ్య రంగం, ఇమ్యునాలజీ పరిశోధనల్లో ఆయన చేసిన కృషి విశేషమని ప్రధాని అభినందించారు. సమాజంలోని సమస్యలను పరిష్కరించే దిశగా ఆయన చేసిన పరిశోధనలు ప్రాముఖ్యత కలిగినవని చెప్పారు. ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ చేసిన అధ్యయనాలు, శాస్త్రీయ పరిశోధనలు భవిష్యత్తులో విధాన రూపకల్పనకు ఉపయోగపడతాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఆరోగ్య రంగంలో మరింత మెరుగైన విధానాలను రూపొందించేందుకు ఆయన సూచనలు కీలకంగా మారనున్నాయని తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ప్రజారోగ్య రంగ అభివృద్ధి, పరిశోధనలకు ప్రాధాన్యత పెంపు వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. శాస్త్రవేత్తల అనుభవాన్ని పాలనలో ఉపయోగించాలనే దృక్పథాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ వంటి శాస్త్రవేత్తలు దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. వారి అనుభవం, పరిశోధనలు సమాజానికి మరింత మేలు చేసే దిశగా ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

# పనిఒత్తిడి ప్రాణాంతకం



ప్రపంచవ్యాప్తంగా ఆధునిక ఉద్యోగ వ్యవస్థలు ఎంత వేగంగా మారుతున్నాయో, అదే స్థాయిలో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదికలో వెల్లడించిన వివరాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అధిక పనిగంటలు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, పనిస్థల వేధింపులు వంటి కారణాలతో ప్రతి సంవత్సరం సుమారు 8.40 లక్షల మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఈ నివేదిక పేర్కొంది. సుదీర్ఘ పనిగంటలు ఉద్యోగుల శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మానసిక స్థితినీ తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. పనిలో నియంత్రణ లేకుండా అధిక బాధ్యతలు, డిమాండ్లు పెరగడం వల్ల ఉద్యోగులు నిరంతర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి దీర్ఘకాలంలో గుండె సంబంధిత వ్యాధులు, నిద్రలేమి, డిప్రెషన్ వంటి సమస్యలకు దారితీస్తోంది. పరిస్థితి మరింత తీవ్రమై కొందరు ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా పెరుగుతున్నాయని నివేదిక స్పష్టం చేసింది.

ఉద్యోగ సంబంధిత మానసిక సమస్యలు కేవలం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే ప్రభావితం చేయడం కాదు, సమాజం, ఆర్థిక వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ప్రతి సంవత్సరం సుమారు 4.5 కోట్ల పని సంవత్సరాలు ఈ సమస్యల కారణంగా వృథా అవుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పాదకతను తగ్గించడమే కాకుండా, సంస్థల పనితీరును కూడా దెబ్బతీస్తోంది. ఆర్థిక పరంగా ఈ నష్టం చాలా పెద్దది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 1.37 శాతం వరకు ఈ మానసిక ఒత్తిడి కారణంగా నష్టం వాటిల్లుతోందని నివేదిక వెల్లడించింది. దీని వల్ల ప్రభుత్వాలు, సంస్థలు భారీ ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఉద్యోగుల గైర్హాజరు పెరగడం వంటి సమస్యలు మరింత భారాన్ని పెంచుతున్నాయి.

ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఐఎల్ఓ అధికారి మానల్ అజ్జీ మాట్లాడుతూ, ఆధునిక పని పరిస్థితుల్లో మానసిక, సామాజికపరమైన ఒత్తిడులు అత్యంత కీలక సవాళ్లుగా మారాయని తెలిపారు. ఉద్యోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణను సంస్థలు ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని, పని ప్రదేశాల్లో సానుకూల వాతావరణం లేకపోతే దీర్ఘకాలంలో తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడేందుకు సమగ్ర విధానాలు అవసరం. సరైన పనిగంటలు, విశ్రాంతి సమయం, మానసిక ఆరోగ్యానికి మద్దతు, వేధింపులపై కఠిన చర్యలు వంటి అంశాలను సంస్థలు అమలు చేయాలి. సానుకూల, భద్రమైన పని వాతావరణం ఏర్పడితేనే ఉత్పాదకత పెరుగుతుంది, ఉద్యోగుల సంతృప్తి మెరుగవుతుంది, దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది.

# యూట్యూబ్ జర్నలిజం



సాంకేతిక విప్లవం పుణ్యమా అని సమాచారం నేడు చేతివేళ్లపైకి వచ్చేసింది. ఒకప్పుడు వార్త తెలియాలంటే మరుసటి రోజు ఉదయం పేపర్ వచ్చే వరకు లేదా టీవీలో బులెటిన్ వేసే వరకు వేచి చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు యూట్యూబ్ పుణ్యమా అని నిమిషం నిమిషానికి అప్‌డేట్స్ అందుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఒక జర్నలిస్టుగా మారిపోతున్నారు. ఈ క్రమంలోనే 'యూట్యూబ్ జర్నలిజం' అనే కొత్త ఒరవడి పుట్టుకొచ్చింది. వేగంగా వార్తలను చేరవేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ నైతిక విలువల విషయంలో మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. వార్త అంటే కేవలం సమాచారం మాత్రమే కాదు అది సామాజిక బాధ్యత అన్న విషయాన్ని చాలా మంది విస్మరిస్తున్నారు. యూట్యూబ్ చానెళ్లలో ప్రస్తుతం ప్రధానంగా కనిపిస్తున్న సమస్య 'క్లిక్ బైట్' సంస్కృతి. వ్యూస్ పెంచుకోవడానికి, తద్వారా వచ్చే ఆదాయం కోసం థంబ్‌నెయిల్స్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారు. లోపల ఉన్న సమాచారానికి బయట కనిపించే హెడ్డింగ్‌కు పొంతన ఉండటం లేదు. ముఖ్యంగా సినీ సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు, రాజకీయ నాయకులపై అసభ్యకరమైన వ్యాఖ్యలతో కూడిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. సంచలనం కోసం నిజాన్ని నిర్ధారించుకోకుండానే వార్తలు ప్రసారం చేయడం వల్ల సామాన్యుల్లో అయోమయం నెలకొంటోంది. బాధ్యతాయుతమైన జర్నలిజం అంటే నిజాన్ని నిష్పక్షపాతంగా చెప్పడం. కానీ నేడు యూట్యూబ్ వేదికగా జరుగుతున్న ప్రసారాల్లో వ్యక్తిగత దూషణలు, పక్షపాత వైఖరి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రధాన స్రవంతి మీడియాలో ఒక వార్త ప్రసారం కావాలంటే ఎడిటోరియల్ బోర్డు ఉంటుంది. అక్కడ వార్త సాధికారతను పరిశీలిస్తారు. కానీ యూట్యూబ్‌లో అటువంటి నియంత్రణ ఏదీ లేదు. ఎవరికి తోచింది వారు మాట్లాడటం, ఎదుటివారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కథనాలు అల్లడం పరిపాటిగా మారింది. దీనివల్ల వృత్తిపరమైన జర్నలిజం ప్రతిష్ట దెబ్బతింటోంది. కేవలం వ్యూస్ కోసం సమాజంలో విద్వేషాలు రగిల్చేలా మాట్లాడటం, మతపరమైన అంశాలను వివాదాస్పదం చేయడం ప్రమాదకరంగా మారుతోంది. నిష్పాక్షికంగా ఉండాల్సిన వార్తా వేదికలు నేడు ఒక వర్గానికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా పనిచేస్తూ అజెండా జర్నలిజానికి తెరలేపుతున్నాయి.జర్నలిజంలో ఉండాల్సిన ప్రాథమిక సూత్రం నిజాయితీ. ఒక వ్యక్తిపై ఆరోపణ చేసేటప్పుడు సదరు వ్యక్తి వివరణ తీసుకోవడం కనీస ధర్మం. కానీ చాలా యూట్యూబ్ చానెళ్లు ఏకపక్షంగా కథనాలు వండుతున్నాయి. దీని వల్ల అమాయకులు బలవుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను నిజమని నమ్మే ప్రజలు ఆ వార్త ప్రభావంతో తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యూట్యూబ్ వార్తల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అక్కడ ఉన్న ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారాలు చేయడం సామాజిక నేరమే అవుతుంది. విలువలతో కూడిన సమాచారం అందించినప్పుడే ఆ చానెల్‌కు దీర్ఘకాలంలో గుర్తింపు ఉంటుంది.యూట్యూబ్ జర్నలిజం అనేది ఒక శక్తివంతమైన ఆయుధం. దాన్ని ఎలా వాడుతున్నామన్నదే ముఖ్యం. నైతిక విలువలతో కూడిన జర్నలిజం సమాజ మార్పుకు దోహదపడుతుంది. అసత్యాలకు స్వస్తి పలికి వాస్తవాలను నిర్భయంగా చెప్పే స్థాయికి డిజిటల్ మీడియా ఎదగాలి. ప్రజలు కూడా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా విచక్షణతో ఆలోచించాలి. విలువల లేని జర్నలిజం సమాజానికి హానికరం. కాబట్టి రేపటి తరం జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించి వృత్తి గౌరవాన్ని కాపాడతారని ఆశిద్దాం. అప్పుడే యూట్యూబ్ చానెళ్లు ప్రజాస్వామ్యానికి నిజమైన అండగా నిలుస్తాయి. నిజమే వార్త కావాలి, అదే సమాజానికి హితవు కావాలి.

# మూఢనమ్మకాల ముగింపు

మనం 21వ శతాబ్దంలో జీవిస్తున్నాం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తు నేటికీ సమాజంలో మూఢనమ్మకాలు వేళ్లూనుకుని ఉన్నాయి. మంత్రాలు, తంత్రాలు, బాణామతి వంటి పేర్లతో అమాయకులను మోసం చేయడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు తీయడం వంటి ఘటనలు నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. విద్యావంతులు సైతం కొన్నిసార్లు ఈ అంధవిశ్వాసాల ఉచ్చులో పడటం ఆందోళన కలిగిస్తోంది. శాస్త్రీయ దృక్పథం అంటే కేవలం సైన్స్ చదువుకోవడం మాత్రమే కాదు. ప్రతి విషయాన్ని తర్కంతో ఆలోచించడం, సాక్ష్యాధారాల ఆధారంగా నిజాన్ని గ్రహించడం. ఈ ఆలోచనా సరళి ప్రజల్లో పెరిగినప్పుడే సమాజం నుంచి మూఢనమ్మకాలు కనుమరుగవుతాయి. మన దేశ రాజ్యాంగం ప్రకారం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళ్లడం కంటే దొంగ బాబాలను, భూతవైద్యులను ఆశ్రయించే వారి సంఖ్య తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణం భయం, అజ్ఞానం. సమస్య ఏదైనా దానికి పరిష్కారం కోసం అశాస్త్రీయ మార్గాలను ఎంచుకోవడం వల్ల సమయం, డబ్బు వృధా కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా సంభవిస్తోంది. సమాజంలో పేరుకుపోయిన ఈ రుగ్మతలను తొలగించాలంటే కేవలం చట్టాలు సరిపోవు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తలు చేపట్టిన ప్రచారం సామాన్యుడి వరకు చేరాల్సిన అవసరం ఉంది.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో విద్యావ్యవస్థ కీలక పాత్ర పోషించాలి. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పాలి. పుస్తకాల్లో ఉన్న విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా అది ఎలా సాధ్యం అన్న తర్కాన్ని నేర్పినప్పుడు పిల్లలు హేతువాదులుగా ఎదుగుతారు. నేటి విద్య కేవలం ఉద్యోగాల కోసమే పరిమితమవుతోంది తప్ప, సామాజిక స్పృహను కలిగించలేకపోతోంది. ఉపాధ్యాయులు తాము బోధించే సైన్స్ పాఠాలను నిత్య జీవితానికి అన్వయించి మూఢనమ్మకాలను పటాపంచలు చేయాలి.



విద్యార్థులు తమ ఇళ్లలో జరిగే అశాస్త్రీయ కార్యకలాపాలను అడ్డుకునే స్థాయికి ఎదగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

మీడియా బాధ్యత కూడా ఈ విషయంలో అత్యంత కీలకం. దురదృష్టవశాత్తు కొన్ని వార్తా సంస్థలు రేటింగ్స్ కోసం జ్యోతిష్యం, వాస్తు, మహిమల పేరుతో మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తున్నాయి. సంచలనం కోసం అద్భుతాలు జరుగుతున్నాయని భ్రమ కల్పించడం వల్ల సామాన్యులు తప్పుదోవ పడుతున్నారు. బాధ్యతాయుతమైన మీడియా సమాజంలో శాస్త్రీయ అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలి. మాయగాళ్లు చేసే మోసాలను బట్టబయలు చేయాలి. ప్రజల్లో ఆలోచనను రేకెత్తించే కథనాలను ప్రసారం చేయాలి. సమాజం పురోగమించాలంటే ప్రజలకు వాస్తవాలను వివరించడం మీడియా కర్తవ్యంగా మారాలి.

చారిత్రక కారణాలు, తరతరాలుగా వస్తున్న కొన్ని ఆచారాలు మూఢనమ్మకాలుగా మారుతున్నాయి. పూర్వీకులు పాటించిన కొన్ని పద్ధతుల వెనుక అప్పట్లో శాస్త్రీయ కారణాలు ఉండవచ్చు. కానీ కాలం మారుతున్న కొద్దీ వాటిని మార్చుకోకపోవడం సమస్యలకు దారితీస్తోంది. ఆచారాలను గౌరవించాలి కానీ అవి ఇతరులకు హాని చేసేవిగా ఉండకూడదు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ మూఢనమ్మకాల వల్ల ఎక్కువగా బాధితులవుతున్నారు. సమాజంలో ఉన్న వెనుకబాటుతనం, పేదరికం కూడా అంధవిశ్వాసాలు పెరగడానికి ఊతమిస్తున్నాయి. ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రస్తుతం సోషల్ మీడియా యుగంలో అవాస్తవాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో అశాస్త్రీయ సమాచారం వైరల్ అవుతోంది. దీనివల్ల ప్రజలు మరింత అయోమయానికి గురవుతున్నారు. ఏదైనా సమాచారాన్ని ఇతరులకు పంపే ముందు దాని యథార్థతను పరిశీలించడం అలవాటు చేసుకోవాలి. విచక్షణ జ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా డిజిటల్ మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రజల్లో చైతన్యం తేవడానికి స్వచ్ఛంద సంస్థలు, విజ్ఞాన వేదికలు గ్రామ గ్రామాన ప్రదర్శనలు నిర్వహించాలి. చేతబడి వంటి సామాజిక దురాచారాలపై కఠినమైన శిక్షలు అమలు చేయాలి.

శాస్త్రీయ దృక్పథం పెరగడం అంటే సంప్రదాయాలను పూర్తిగా వ్యతిరేకించడం కాదు. కేవలం హానికరమైన అంధవిశ్వాసాలను మాత్రమే తిరస్కరించడం. జ్ఞానం ఎక్కడ ఉంటే అక్కడ వెలుగు ఉంటుంది, అజ్ఞానం ఎక్కడ ఉంటే అక్కడ చీకటి ఉంటుంది. సమాజాన్ని చీకటి నుండి వెలుగులోకి నడిపించాలంటే శాస్త్రీయ ఆలోచనలే దీపాలు. యువత ఈ విషయంలో చురుకైన పాత్ర పోషించాలి. తమ చుట్టూ జరుగుతున్న మోసాలను ఎండగట్టాలి. మూఢనమ్మకాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. అప్పుడే భారతదేశం నిజమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది.

కేవలం గ్రామాలకే పరిమితం కాకుండా నగరాల్లోని ఉన్నత వర్గాల్లో కూడా ఈ మూఢనమ్మకాలు విస్తరిస్తున్నాయి. గ్రహ గతులు మార్చగలమని, దోషాలను నివారించగలమని చెప్పే వ్యాపార ప్రకటనలు వెల్లువలవుతున్నాయి. భవిష్యత్తుపై ఉన్న ఆందోళనను ఈ మోసగాళ్లు పెట్టుబడిగా మలచుకుంటున్నారు. శాస్త్రీయ దృక్పథం ఉన్న వ్యక్తి తన కష్టాన్ని, నైపుణ్యాన్ని నమ్ముకుంటాడు తప్ప అదృశ్య శక్తులపై ఆధారపడడు. సమాజంలోని ప్రతి వ్యక్తి తన ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోవాలి. ఏ విషయమైనా కళ్ళకు కనిపిస్తున్న సత్యంతో పోల్చి చూసుకోవాలి. అప్పుడే మోసగాళ్ళ నుండి సమాజం రక్షించబడుతుంది. జ్ఞాన సముపార్జన అనేది నిరంతర ప్రక్రియ. కొత్త విషయాలను నేర్చుకోవడం వల్ల మెదడు చురుగ్గా పనిచేయడమే కాకుండా అవాస్తవాలను పక్కన పెట్టే శక్తి వస్తుంది. సమాజంలో మార్పు రావాలంటే అది వ్యక్తుల నుండే ప్రారంభం కావాలి. మన ఇంట్లో జరిగే అశాస్త్రీయ పద్ధతులను మనం ధైర్యంగా ప్రశ్నించాలి. హేతుబద్ధమైన ఆలోచనలే నాగరికతకు పునాదులు. ప్రతి సమస్యకు పరిష్కారం సైన్స్‌లోనే ఉందనే నమ్మకాన్ని పెంపొందించుకోవాలి. సమాజ హితాన్ని కోరే ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని ఒక జీవన విధానంగా మార్చుకోవాలి. దీనికోసం చదువుకున్న వారు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి. మూఢనమ్మకాల నిర్మూలన అనేది ఒక సుదీర్ఘ పోరాటం. ఇది కేవలం ఒక్కరితో సాధ్యం కాదు. ప్రభుత్వం, మీడియా, విద్యా సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాలి. ప్రతి ఒక్కరిలో 'ఎందుకు? ఎలా?' అనే ప్రశ్న ఉదయించినప్పుడే శాస్త్రీయ దృక్పథం పురుడుపోసుకుంటుంది. మూఢనమ్మకాలను వదిలి విజ్ఞానాన్ని ఆయుధంగా మలచుకుందాం. భావి తరాలకు భయ రహితమైన, జ్ఞానవంతమైన సమాజాన్ని అందిద్దాం. నిరంతర అన్వేషణ, తర్కం, మానవత్వం ఉన్న సమాజమే నాగరిక సమాజం. ఆ దిశగా మన ప్రయాణం సాగాలి. నిజమైన స్వేచ్ఛ అంటే అజ్ఞానపు సంకెళ్ల నుండి విముక్తి పొందడమే. అప్పుడే మన దేశానికి సరైన గౌరవం లభిస్తుంది.

# పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత

ప్రకృతి వైవిధ్యం ఈ భూమికి అలంకారం మాత్రమే కాదు, మానవ మనుగడకు అత్యవసరం. ప్రతి చిన్న ప్రాణి, వృక్షం పర్యావరణ చక్రంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల అనేక జీవజాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జీవ వైవిధ్యం పట్ల అవగాహన కల్పించడం, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి కనీస బాధ్యతగా మారింది. ప్రకృతిని గౌరవించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమే అని పెద్దలు చెబుతుంటారు. అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం, కాలుష్యాన్ని పెంచడం వల్ల జీవ వైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. దీనివల్ల వాతావరణంలో అస్థిరత ఏర్పడి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. స్థానిక వృక్షజాలం, జంతుజాలం ఆయా ప్రాంతాల పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయి. మన చుట్టూ ఉండే వేప, రావి, మర్రి వంటి చెట్లు కేవలం నీడను మాత్రమే కాకుండా ఆక్సిజన్ అందించడంలో, భూగర్భ జలాలను పెంచడంలో తోడ్పడతాయి. అదేవిధంగా పక్షులు, కీటకాలు పరాగ సంపర్కానికి సహాయపడి ఆహార ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆధునిక కాలంలో కాంక్రీట్ జంగిల్స్ పెరగడం వల్ల ఈ జీవరాశులకు నివాస స్థలాలు కరువయ్యాయి. వీటిని కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలకు కేవలం పుస్తకాల్లో మాత్రమే ఇవి కనిపిస్తాయి. స్థానిక మొక్కలను నాటడం, నీటి వనరులను కలుషితం చేయకుండా చూడటం వంటి చిన్న మార్పులు పెద్ద ఫలితాలను ఇస్తాయి. పర్యావరణ స్పృహ పెంచడంలో విద్యార్థులు, యువత పాత్ర అత్యంత కీలకం. పాఠశాల స్థాయి నుండే పర్యావరణ విద్యను ఒక భాగం చేయాలి. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ పద్ధతులను అనుసరించడం ద్వారా కాలుష్యాన్ని అదుపు చేయవచ్చు. ప్రభుత్వాలు సైతం పర్యావరణ హితమైన చట్టాలను అమలు చేయాలి. పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలు నేరుగా నదుల్లోకి, భూమిలోకి వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. అడవుల విస్తీర్ణం పెంచడానికి సామాజిక వన ప్రేమికులను ప్రోత్సహించడం ద్వారా జీవ వైవిధ్యానికి ఊపిరి పోయవచ్చు. ప్రకృతితో మమేకమై జీవించడం మన సంస్కృతిలో ఒక భాగంగా ఉంది. పూర్వం నుండి చెట్లను, నదులను పూజించడం వెనుక ఉన్న ఉద్దేశ్యం వాటిని గౌరవించడమే. నేటి యాంత్రిక జీవనంలో మనం ప్రకృతికి దూరంగా జరుగుతున్నాం. దీనివల్ల అనేక కొత్త రకమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. స్వచ్ఛమైన గాలి, నీరు లభించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిందే. ఏప్రిల్ 28న నిర్వహించే పలు కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం నింపడానికి ఉపయోగపడతాయి. భూమిపై ఉన్న ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉంది. ఆ హక్కును కాపాడటం మనందరి ప్రాథమిక కర్తవ్యం. అంతరించిపోతున్న పక్షులు, జంతువుల కోసం ప్రత్యేక అభయారణ్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. అడవి జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయంటే వాటి ఆవాసాలను మనం ఆక్రమించడమే కారణం. ఈ అంతరాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన పద్ధతులను పాటించాలి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారాన్ని కాపాడటంతో పాటు మిత్ర పురుగుల మనుగడకు సహకరించవచ్చు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల నేల తల్లి విషతుల్యం అవుతోంది. ప్రకృతి సిద్ధమైన వ్యవహార శైలిని అలవర్చుకోవడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుంది.అప్పుడే ఈ భూమి జీవరాశులందరికీ స్వర్గధామం అవుతుంది. మన బాధ్యతను గుర్తించి ప్రకృతిని కాపాడుకుందాం.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 'కల్కి 2'పై భారీ అంచనాలు



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడి' చిత్రం ఘన విజయాన్ని సాధించిన నేపథ్యంలో, ఇప్పుడు దాని సీక్వెల్ 'కల్కి 2'పై అంచనాలు భారీగా పెరిగాయి. మొదటి భాగం వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించగా, రెండో భాగాన్ని మరింత విస్తృత స్థాయిలో తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగంతో తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికర మలుపులతో సీక్వెల్‌ను రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.ఇక ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ ప్రత్యేక పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్ వినిపిస్తోంది. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపించిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథపై నడుస్తుందని సమాచారం. 'కర్ణ 3102 బీసీ' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనుండగా, ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా కీలక పాత్రలో నటించనున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఈ ఇద్దరు కలిసి నటించడం విశేషంగా మారింది.

# పారితోషికం తగ్గించిన బాలయ్య



సినిమా రంగంలో హీరోల పారితోషికాలు రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో, నిర్మాతల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తన రెమ్యునరేషన్‌ను తగ్గించుకున్న హీరోగా నందమూరి బాలకృష్ణ మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.ఇటీవల వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న బాలకృష్ణ 'అఖండ' నుంచి మొదలైన హిట్ పరంపరతో తన మార్కెట్‌ను మరింత పెంచుకున్నారు. దీంతో నిర్మాతలు ఆయన అడిగినంత పారితోషికం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితి నెలకొంది.అయితే గతేడాది విడుదలైన 'అఖండ2' చిత్రం భారీ బడ్జెట్ తో తెరకెక్కి మంచి వసూళ్లు సాధించినప్పటికీ, ఖర్చులు అధికంగా ఉండటంతో నిర్మాతలకు ఆశించిన లాభాలు అందలేదని సమాచారం. ఈ నేపథ్యంలో బాలకృష్ణ తీసుకున్న నిర్ణయం పరిశ్రమలో చర్చనీయాంశమైంది.ఈ చిత్రానికి దాదాపు 40 కోట్ల రూపాయల పారితోషికం తీసుకున్న ఆయన, ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి తన రెమ్యునరేషన్‌ను గణనీయంగా తగ్గించుకున్నట్లు తెలిసింది. సుమారు 10 కోట్ల వరకు తగ్గించి 30 కోట్లకే అంగీకరించారని సమాచారం. సినిమా ఫలితం ఎలా ఉన్నా పూర్తి పారితోషికం తీసుకోవడం సాధారణంగా మారిన ఈ రోజుల్లో, నిర్మాతలపై భారం పడకూడదనే ఉద్దేశంతో బాలయ్య తీసుకున్న ఈ నిర్ణయం సినీ వర్గాలను ఆకట్టుకుంటోంది. ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై ట్రేడ్ వర్గాలు, సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఇక అభిమానులు కూడా సోషల్ మీడియాలో బాలకృష్ణను ప్రశంసిస్తూ స్పందిస్తున్నారు. ప్రస్తుతం రూపొందుతున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. గతంలో 'వీరసింహారెడ్డి'తో విజయాన్ని అందుకున్న ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.



# గోల్ఫ్ స్టార్ నుంచి హీరోయిన్‌గా రకుల్ ప్రయాణం

సినిమా రంగంలోకి రావడానికి ముందు పలువురు నటీనటులు వేర్వేరు రంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. కొందరు ఉద్యోగాలు చేస్తే, మరికొందరు వ్యాపారాలు నిర్వహించారు. ఇంకొందరు క్రీడల నుంచి సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అలాంటి వారిలో ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఒకరు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న రకుల్, గోల్ఫ్‌లో మంచి ప్రతిభ కనబరిచింది. పది సంవత్సరాల వయసులోనే గోల్ఫ్ ఆడటం ప్రారంభించి, హైస్కూల్ దశలో జూనియర్ నేషనల్ స్థాయి పోటీల్లో కూడా పాల్గొంది. గోల్ఫ్‌లో మంచి భవిష్యత్ ఉన్నప్పటికీ, సినిమాలపై ఆసక్తితో ఆ క్రీడను పక్కన పెట్టింది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన రకుల్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, మహేష్ బాబు, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందింది. వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. తర్వాత బాలీవుడ్ వైపు అడుగులేసిన ఆమె అక్కడ కూడా పలు చిత్రాల్లో నటించింది. అనంతరం వివాహం చేసుకుని సినిమాల సంఖ్యను తగ్గించింది. ఇటీవల తెలుగు సినిమాల్లో ఎక్కువగా కనిపించకపోయినా, ఇతర భాషల్లో అవకాశాలు అందుకుంటూ కొనసాగుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తుచేసుకుంది. ఆర్మీ నేపథ్య కుటుంబంలో పెరిగిన తాను చిన్నప్పుడు ఎక్కువగా హిందీ సినిమాలే చూసేదాన్నని తెలిపింది. ప్రారంభంలో హిందీ సినిమాలపైనే దృష్టి పెట్టానని, తర్వాత అవకాశాలు రావడంతో ఇతర భాషల్లో కూడా నటించానని చెప్పింది. గోల్ఫ్‌ను వదిలేయడానికి కారణంగా ఎక్కువసేపు బయట ఆడటంతో తన చర్మరంగు మారిపోవడం, అలాగే మోడలింగ్, నటనపై ఆసక్తి పెరగడం కారణమని వెల్లడించింది. కష్టపడితే ఏ రంగంలోనైనా ఎదగవచ్చని ఆమె ప్రయాణం స్పష్టంగా చూపిస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in